డ్వాక్రా మహిళల ఆశాకిరణం సీఎం జగన్

- ఇచ్చిన మాట ప్రకారం నాలుగో విడత రుణ మాఫీ
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్
- 7 వార్డుల పరిధిలో రూ 33.5 కోట్ల రుణ మాఫీ



హాజరైన డ్వాక్రా మహిళలు



పొదుపు సంఘాల ప్రతినిధులకు చెక్ అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, యూసీడీ పీడీ పాపునాయుడు

మల్కాపురం: తమ పబ్బం గడుపుకోవడానికి మాట ఇచ్చే నాయకుడిని మనం చూశాం... ఎలాంటి ప్రయోజనం ఆశించకుండా ప్రజలకు ఇచ్చిన మాటపై నిలబడిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని ఏపీ సూక్ష్మ, చిన్న,మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు బుధవారం 58వ వార్డు అన్నపూర్ణనగర్ మైదానంలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఏడు వార్డుల పరిధిలో లబ్ధిదారులకు నాలుగు విడతల కింద



నవరత్నాల పథకాలను వివరిస్తూ వేసిన ముగ్గు

రూ.39.36కోట్లు నేరుగా ఖాతాల్లో వేశారని చెప్పారు.

వార్డుల వారీగా రుణమాఫీ వివరాలు

జీవీఎంసీ 40వ వార్డులో 802 మంది పొదుపు సంఘాల సభ్యులకు రూ. 1,32,82,43 నాలుగు విడతలుగా అందించారు.

- 58వ వార్డులో 2660 మంది సభ్యులకు రూ 6.55 లక్షలు, 59వ వార్డులో 2690 పొదుపు సంఘాల సభ్యులకు రూ.7.78 కోట్లు, 60వ వార్డులో 2500 మంది పొదుపు సంఘా సభ్యులకు రూ. 6.25 కోట్లు, 61వ వార్డు పరిధిలో 1690 మంది పొదుపు సంఘాల సభ్యులకు రూ.4.45 కోట్లు, 62వ వార్డు పరిధిలో 3250 మంది పొదుపు సంఘాల సభ్యులకు రూ.8.5 కోట్లు, 63వ వార్డు పరిధిలో 1250 మంది పొదుపు సంఘాల సభ్యులకు రూ.3 కోట్ల రుణమాఫీ నాలుగు విడతల్లో జరిగిందని వివరించారు.

మాటకు కట్టుబడే నాయకుడు జగన్

మాటకు కట్టుబడే నాయకుడు సీఎం జగన్ అని.. దాన్ని నిలబెట్టుకోవడానికి ఎంత కష్టాన్ని అయినా ఆయన ఎదుర్కొంటారని ఆనంద్‌కుమార్ చెప్పారు. మహిళలు ఒక్కసారి ఆలోచన చేసి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవడానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. పేద ప్రజలకు విద్య,వైద్యం ఉచితంగా అందిస్తూ పేదల



జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

పాలిట పెన్నిధిగా జగన్ నిలిచారన్నారు. తండ్రి వైఎస్సార్ ఆశయాలకు తగ్గ విధంగా నడుచుకుంటూ దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని చెప్పారు. కరోనా వంటి గడ్డు కాలన్ని రెండేళ్లు ఎదుర్కొన్నా.. పేదల సంక్షేమాన్ని మరువని నాయకుడిగా చరిత్రలో జగన్ నిలుస్తారన్నారు. అలాంటి వ్యక్తి వెంట మహిళ లోకం నిలవాలని కోరారు. కార్యక్రమంలో జోన్–5 జెడ్సీ జీవీఎల్ కృష్ణ, యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పాపునాయుడు, ఏపీడీ సీహెచ్.చిరంజీవి, వైఎస్సార్‌సీపీ పశ్చిమ పరిశీలకుడు ఎస్.ఏ.రహమాన్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, పలు వార్డుల కార్పొరేటర్లు లావణ్య,పి.వి.సురేష్, బల్లా లక్ష్మణరావు,గుండపు నాగేశ్వరరావు, ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, క్లస్టర్ అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్, వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్ ఆల్ఫా కృష్ణ, నాయకులు చుక్క వరలక్ష్మి,మళ్ల ధనలత,తోణంగి వెంకటరమణితో పాటు పలు వార్డుల పార్టీ అధ్యక్షులు, యూసీడీ సీఓలు,ఆర్‌పీలు, క్లస్టర్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళల మోములో చిరునవ్వు



ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మా పొదుపు సంఘాల వారికి నాలుగో విడత రుణ మాఫీ చేయడం చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో చాలా మంది మహిళలు స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకున్నారు. పొదుపు సంఘాల మహిళల ముఖంపై చెరగని చిరునవ్వుకు కారణం జగనన్న ఆర్థికంగా అండగా నిలవడమే.

– వజ్జల లత, ఆర్‌పీ, శ్రీహరిపురం ఏరియా

రూ.16 వేలు లబ్ధి



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాలాంటి మహిళలు ఆర్థికంగా ఎదగాలని చేస్తున్న కృషి అభినందనీయం. నాలుగు విడతల రుణ మాఫీలో నాకు వ్యక్తిగతంగా రూ. 16 వేల వరకు లబ్ధిపొందాను. చాలా సంతోషంగా ఉంది.

– టి.శైలజ, పొదుపు సంఘం సభ్యురాలు

మహిళా సంఘాలు జగనన్న వెంటే



ఇచ్చిన మాట ప్రకారం పొదుపు సంఘాల మహిళలకు రుణాలు మాఫీ చేసి మా ఆర్థిక ఇబ్బందులను జగనన్న గట్టెక్కిస్తున్నారు. ఆయనకు మా సంఘం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుంది. నాలుగేళ్లలో సుమారు రూ. 40 వేల వరకు నేను లబ్ధిపొందాను.

– ఎం.రాధ, జైదుర్గా పొదుపు సంఘ సభ్యురాలు

కొడుకు మాదిరిగా..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మా కొడుకు మాదిరిగా అండగా నిలుస్తున్నాడు. ఆర్థికంగా ప్రోత్సహిస్తూ మాకు భరోసా కల్పిస్తున్నాడు. ఇలాంటి నాయకుడు మరలా మన ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలోని ప్రతి పేద మహిళకు న్యాయం జరుగుతంది. గడిచిన ఈ నాలుగేళ్లలో నేను సుమారు రూ.38 వేల వరకు లబ్ధిపొందాను.

–బంగారమ్మ, బంగారమ్మ పొదుపు సంఘం సభ్యురాలు

క్లుప్తంగా

ఘనంగా కుంచుమాంబ, దుర్గమాంబ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు శ్రీహరిపురం గ్రామదేవతలు కుంచుమాంబ,దుర్గమాంబ అమ్మవార్ల జాతర (పరస) బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు ఇద్దరి అమ్మవార్లకు వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీహరిపురం నుంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల వారు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. సేవ గరిడీ, కోలాట ప్రదర్శన,భజన కార్యక్రమాలతో పాటు సాయంత్రం వినోదభరిత సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జాతరలో భాగంగా అమ్మవార్లను వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్,ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బద్రీనాథ్ తదితరులు దర్శించుకుని పూజలు చేశారు.

కంప్యూటర్–టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు

కంచరపాలెం: కంచరపాలెం అశోకనగర్ బౌద్ధాలయంలో ఆంధ్రా బౌద్ధ సమాజం కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి ఉచితంగా మహిళలకు టైలరింగ్, యువతకు కంప్యూటర్‌లో 3 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల మహిళలు, యువత దరఖాస్తులు చేసుకోవాలన్నారు మరిన్ని వివరాలకు 96760–30455 నంబర్లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఇంటక్ నేత మోహన్ కుమార్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న ఇంటక్ ప్రతినిధులు

మల్కాపురం: కార్మికుల పక్షాన మోహన్‌కుమార్ చేసిన పోరాటాలు ఆదర్శనీయమని ఇంటక్ నేతలు కొనియాడారు. దివంగత ట్రేడ్ యూనియన్ నాయకుడు,వైద్యుడు మోహన్‌కుమార్ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆంధ్ర మోటార్ ట్యాంకర్స్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఇంటక్ జిల్లా నాయకులు మంత్రి రాజశేఖర్,భోగవల్లి నాగభూషణం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఇంటక్ నాయకులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ



గోడౌన్‌కు వేసిన సీల్ పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఆరిలోవ: రూరల్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోడౌన్‌ను బుధవారం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా భీమిలి ఆర్డీవో భాస్కర్‌రెడ్డి, రూరల్ తహసీల్దార్ రమణయ్యతో కలసి ఆయన గోడౌన్‌కు వేసిన సీల్, లోపల ఉన్న వీవీ ప్యాట్లు, ఇతర సామగ్రిని పరిశీలించారు. సీసీ ఫుటేజ్‌లను పరిశీలించి.. సిబ్బంది విధులపై ఆరా తీశారు. భద్రత ప్రమాణాలు పాటించాలని వారిని ఆదేశించారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

విశాఖ విద్య: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని మర్రిపాలెం వుడా లేఅవుట్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కె. నాగేశ్వరరావు అన్నారు. బుధవారం గ్రీన్‌బెల్ట్ పార్కులో వాకర్స్ క్లబ్, ఎలియన్స్ అసోసియేషన్ సంయుక్త సమావేశం నిర్వహించారు. ఎలియన్స్ క్లబ్ గవర్నర్ విద్యా సాగర్‌ను ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వాకర్స్ క్లబ్, ఎలియన్స్ క్లబ్ సభ్యులంతా ఇక నుంచి సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని నిర్ణయించారు. విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందించేలా కార్యక్రమాలు రూపకల్పన చేయనున్నట్లు ఎలియన్స్ క్లబ్ అధ్యక్షుడు పటా



విద్యాసాగర్‌ను సన్మానిస్తున్న సభ్యులు

్నయక్ అన్నారు. సమావేశంలో వాకర్స్ క్లబ్ కార్యదర్శి జాకబ్, కోశాధికారి డి. లక్ష్మణ రావు, సభ్యులు ఈటి సత్యనారాయణ, ఎలియన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ కె. రాజేశ్వరరావు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బరాజు మృతి తీరనిలోటు

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని రాఘవేంద్రరావు

అల్లిపురం: సీపీఐ సీనియర్ నాయకుడు, జాతీయ బ్యాంకుల యూనియన్ పూర్వ నేత, విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ పూర్వ పాలకవర్గ సభ్యుడు కె.వి.సుబ్బరాజు అకాల మృతి కార్మిక వర్గానికి, కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని రాఘవేంద్రరావు అభిప్రాయపడ్డారు. కె.వి.సుబ్బరాజు సంతాప సభ బుధవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.ఎస్.జె.అచ్యుతరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాఘవేంద్రరావు మాట్లాడుతూ సుబ్బరాజు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేశారని, ముఖ్యంగా శ్రామిక వర్గం విముక్తికి, కమ్యూనిస్టు పార్టీ పటిష్టతకు ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, ఎస్.కె.రెహమాన్, పి.చంద్రశేఖర్, క్షేత్రపాల్, బ్యాంక్ సహాయ ముఖ్య నిర్వహణ అధికారి వరలక్ష్మి,



సుబ్బరాజు చిత్రపటం వద్ద సంతాపం తెలియజేస్తున్న చలసాని రాఘవేంద్రరావు

యూనియన్ నేతలు ఎర్రయ్యరెడ్డి, రెడ్డి శ్రీనివాస్, విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బీసీహెచ్ మసేను, సీనియర్ నాయకులు దేవరకొండ మార్కండేయులు పాల్గొన్నారు. సుబ్బరాజు మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ వెళ్లి సుబ్బరాజు అంతిమయాత్రలో పాల్గొని నివాళులు అర్పించారు. సుబ్బరాజు పార్థివదేహాన్ని పాడి మోసి దహన సంస్కారాలు నిర్వహించారు.

తైక్వాండో క్రీడాకారుడికి ఘన స్వాగతం

- థాయ్‌లాండ్‌లో వెండి పతకం సాధించిన ప్రకాష్

గోపాలపట్నం: థాయ్‌లాండ్‌లో ఇటీవల జరిగిన తైక్వాండో పోటీల్లో వెండి పతకం సాధించిన మూలపర్తి ప్రకాష్‌కు విశాఖ విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. థాయ్‌లాండ్ నుంచి బుధవారం రాత్రి విశాఖ వచ్చిన ఆయన్ని ఆల్ ఇండియా మెగా స్టార్ చిరంజీవి స్పోర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ పాండ్రంకి రుక్మాకరరావు, సహచర క్రీడాకారులు పూలమాలలు, శాలువలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ ఈ 25 నుంచి 27వ తేదీ వరకు థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో దేశానికి వెండి పతకం అందించడం ఆనందంగా



విశాఖ విమానాశ్రయంలో ప్రకాష్‌కు స్వాగతం పలుకుతున్న పాండ్రంకి రుక్మాకరరావు తదితరులు

ఉందన్నారు. తనకు శిక్షణ ఇచ్చిన కోచ్ రుక్మాకరరావు, ప్రోత్సహించిన కుటుంబసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. డానియల్ మాస్టార్, యనమరెడ్డి కనకరెడ్డ్, హేమలతా రెడ్డి, అంజలిరెడ్డి, క్రీడాకారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై నిఘా

నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

అల్లిపురం: నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో గల రౌడీషీటర్లపై నిఘా పెంచాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవి శంకర్ ఆదేశించారు. బుధవారం పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ట్రాఫిక్, క్రైం, శాంతిభద్రతలు, స్పెషల్ బ్రాంచ్‌లకు వేర్వేరుగా సమీక్ష సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నగరంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్రమ మద్యం, నగదు, ఇతర అనుమానిత వస్తువులను పూర్తిగా నివారించేలా అన్ని వాహనాలను నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్‌డీపీఎస్ రవాణాకు అడ్డుకట్టకు చర్యలు తీసుకోవాలన్నారు.

నగరంలో రాత్రిపూట నిఘా మరింత పటిష్టంగా అమలు చేయాలన్నారు. అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన, జగనన్నకు చెబుదాం, డయల్ 112లకు వచ్చే ఫిర్యాదులను నిర్ణీత కాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో పోలీస్ ఉన్నతాధికారులు, లీగల్ అడ్వయిజర్లు పాల్గొన్నారు.

ఉత్తమ బోధనలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకం

సింథియా: విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ ఉత్తమ బోధన అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అన్నారు. గాంధీగ్రామం జీవీఎంసీ హైస్కూల్ సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు పొన్నగంటి భాస్కర్‌సత్య ప్రసాద్ ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సభకు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాస్టారు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో నాడు–నేడు ద్వారా స్కూళ్ల రూపురేఖలు మారాయన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేలా జ్ఞానాన్ని, తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, మల్కాపురం జీవీఎంసీ హైస్కూల్ హెచ్‌ఎం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో దేవదాయశాఖ ట్రిబ్యునల్ న్యాయమూర్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న న్యాయమూర్తి హరినాథ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం రాష్ట్ర దేవదాయశాఖ ట్రిబ్యునల్ న్యాయమూర్తి హరినాథ్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంబాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక,శేషవస్త్రాన్ని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేశారు.

కల్యాణం.. కమనీయం



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

అప్పన్నకు ఏపీఈఆర్సీ చైర్మన్ నాగార్జునరెడ్డి పూజలు



జస్టిస్ నాగార్జునరెడ్డికి అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని బుధవారం ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాన్ని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆయనకు అందించారు.

పెందుర్తి సీఐ రామకృష్ణ బాధ్యతల స్వీకరణ

పెందుర్తి: పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎల్.రామకృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెందుర్తి ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణకు పూర్తిస్థాయిలో కృషి చేస్తామని చెప్పారు. రామకృష్ణ గతంలో పెందుర్తి క్రైం విభాగంలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు.

సీఐపీఈటీ నూతన బ్యాచ్ ప్రారంభం

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం సౌజన్యంతో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ (సీఐపీఈటీ) ఆధ్వర్యంలో విజయవాడలో మెషిన్ ఆపరేటర్–ప్లాస్టిక్ ప్రాసెసింగ్‌లో అవుట్ గోయింగ్ బ్యాచ్‌కు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం సంస్థ ప్రాజెక్టు హెడ్ సంజయ్ సింగ్ సిన్హా ప్రారంభించారు. లబ్ధిదారులకు శిక్షణ కిట్లు, స్టైఫండ్ అందజేశారు. అనంతరం ప్రాజెక్టు హెడ్ సిన్హా మాట్లాడుతూ సంస్థ అందజేస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. జీవితాలకు, వృత్తికి బలమైన పునాదులు వేస్తూ ఉజ్వల



నూతన బ్యాచ్‌తో సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ ఎస్.కె. సిన్హా

భవిష్యత్ కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ హెచ్‌ఆర్ హెడ్ బి.బి.పాత్ర, సీఐపీఈటీ జాయింట్ డైరెక్టర్ శేఖర్, సీఎస్సార్ హెచ్‌ఆర్ మేనేజర్ కె.ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

కళ్లద్దాల పంపిణీ

సింథియా: జీవీఎంసీ 40వ వార్డులో మొదటి విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యాక్రమం ద్వారా కంటి పరీక్షలు చేయించుకున్న 36 మందికి వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా బుధవారం వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలతో పేదప్రజలకు అండగా ఉంటుందన్నారు. డబ్బులు లేక వైద్యం చేయించుకోలేని పేదలను దృష్టిలో పెట్టుకుని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకువచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిని జల్లెడ పడుతూ ప్రజల ఆరోగ్య సమస్యలను ఎప్పటికప్పుడూ తెలుసుకుంటూ యోగక్షేమాలు పరిశీలిస్తున్నారని అన్నారు. మెరుగైన వైద్య సేవలను అందించడంతో పాటు ఆరోగ్యశ్రీ ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేస్తున్నారన్నారు. కంటి వెలుగు ద్వారా మొదటి విడతలో 60 మందికి ఆపరేషన్లు కూడా నిర్వహించారని అన్నారు. జగనన్న ప్రభుత్వం మళ్లీ వస్తే పేద,బడుగు బలహీనవర్గాల ఆశయాలు నెరవేరుతాయని చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు వరపల మహేష్, యూత్ అధ్యక్షుడు గుండపు అశోక్, బలిజ గణేష్, శరగడం గంగరాజు, ఆశకార్యకర్తలు పావని, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

ఆర్‌ఐవోగా సత్యనారాయణ సేవలు అమోఘం

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారిగా పనిచేస్తూ బుధవారం ఉద్యోగ విరమణ చేసిన రాయల సత్యనారాయణ సేవలు అమోఘమని ఆర్‌ఐవో కార్యాలయ సూపరింటెండెంట్ గణేష్ అన్నారు. కార్యాలయ అధికారుల, సిబ్బంది అంతా బుధవారం సత్యనారాయణకు ఘనంగా వీడ్కోలు పలికారు. పుష్పగుచ్ఛాలను అందజేసి, శాలువతో సత్కరించారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి, ఎంతో అమూల్యమైన సలహాలు, సూచనలు అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మురళి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సత్యనారాయణను సత్కరిస్తున్న గణేష్, సిబ్బంది

దాడి కేసులో ఏడేళ్లు జైలు

అక్కిరెడ్డిపాలెం: యువకునిపై దాడి చేసిన వ్యక్తికి గాజువాక కోర్టు 7 ఏళ్లు జైలు శిక్ష, రూ. వెయ్యి జరీమానా విధించింది. గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు తెలిపిన వివరాల ప్రకారం.. 2019 నవంబర్ 28వ తేదీన గాజువాక గాయత్రి బార్ అండ్ రెస్టారెంట్ వద్ద షేక్ అబ్దుల్లా అతని స్నేహితుడిని చంపేస్తానని బెదిరించడంతోపాటు బీర్ బాటిల్‌తో కుడి చేతి మీద, గెడ్డం మీద పొడవటంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడు గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ బి.బి.ఎస్.గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు అనంతరం కోర్టులో ఛార్జిషీట్ వేయగా గాజువాక మేజిస్ట్రేట్ జి.షణ్ముఖరావు విచారణ అనంతరం పై విధంగా తీర్పు ఇచ్చారు.